సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 14 । జూలై । 2023



సమ్మె ఆగదు

ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు.

- IIIలో ▸



విద్యుత్‌పై స్పష్టత ఇవ్వాలి

ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టత ఇవ్వాలని జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేశారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /22.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం బలమైన గాలులు వీస్తాయి. జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డీపీఆర్వోగా శాంతికుమార్

సాక్షి, కామారెడ్డి: జిల్లా పౌరసంబంధాలు, సమాచార శాఖ అధికారిగా శాంతికుమార్ నియమితులయ్యారు. మెదక్ డీపీఆర్వోగా పనిచేస్తున్న ఆయనను కామారెడ్డికి బదిలీ చేశారు. ఆయన శుక్రవారం విధుల్లో చేరతారని తెలిసింది. చాలాకాలంగా డీపీఆర్వో పోస్టు ఇన్‌చార్జీలతో కొనసాగుతోంది. ప్రభుత్వం ఎట్టకేలకు రెగ్యులర్ డీపీఆర్వోను నియమించింది.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంకు దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి టౌన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు శనివారంతో ముగియనుంది. అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో డే స్కాలర్ 70 సీట్లు, ఐదో తరగతిలో రెసిడెన్షియల్ 72 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఆయా తరగతులలో డ్రాప్ అవుట్ అయిన 36 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని, ఇతర వివరాల కోసం 94402 28716 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈనెల 20వ తేదీన లాటరీ పద్ధతిన విద్యార్థులకు సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

నేడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించనున్న స్పీకర్

బాన్సువాడ: బాన్సువాడ ఆస్పత్రి వద్ద నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాలు, అదనపు పడకల డయాలసిస్ కేంద్రాలను స్పీకర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

చలో ఓయూ పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరు: ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో ఓయూ కార్యక్రమాన్ని చేపట్టామని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా తెలిపారు. గురువారం భిక్కనూరులోని తెయూ సౌత్ క్యాంపస్ వద్ద చలో ఓయూకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మహాధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్రంలోని కాంట్రాక్టు అధ్యాపకులను కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, రమాదేవి, సునీత, వైశాలి, సరిత, నిరంజన్‌శర్మ, శ్రీమాత, దిలీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాకు ఖాతాల బదిలీ

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి జీపీఎఫ్ ఖాతాలను కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలుగా వేరు చేయడం జరిగిందని జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాకు 1,926 ఖాతాలను బదిలీ చేశామన్నారు. సాధారణ భవిష్య నిధిలో ఈ ఏడాది మార్చి 31 వరకు ఉన్న నిధులు రూ. 73,88,74,774 బదిలీ చేశామని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్ లావాదేవీల కోసం కామారెడ్డి జెడ్పీలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సుందరవద రాజన్, జీపీఎఫ్ పర్యవేక్షకులు సునీతా దేవి, కామారెడ్డి జిల్లా జీపీఎఫ్ పర్యవేక్షకులు మనోహర్ పాల్గొన్నారు.


రేపు తెలంగాణ వర్సిటీ బంద్‌కు పిలుపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారం కోసం శనివారం వర్సిటీ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి కె.శ్రీశైలం తెలిపారు. గురువారం తెయూ మినీ సెమినార్ హాల్‌లో ఆయన మాట్లాడారు. వర్సిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని లేదంటే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

● జుక్కల్ కాంగ్రెస్‌లో

మూడు ముక్కలాట!

త్రిభాషా సంగమ ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన జుక్కల్‌లో ప్రధాన పార్టీల నుంచి పోటీకి పలువురు సై అంటున్నారు. కాంగ్రెస్‌లో మూడుముక్కలాట నడుస్తోంది. ముగ్గురు నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



సొదాగర్ గంగారాం
లక్ష్మీకాంతరావ్
గడుగు గంగాధర్

- నియోజకవర్గంలో పోటాపోటీగా కార్యక్రమాలు
- మూడు వర్గాలుగా పార్టీ శ్రేణులు

సాక్షి, కామారెడ్డి : మూడు రాష్ట్రాల కూడలి.. మూడు భాషలు మాట్లాడే మనుషులు.. విభిన్న సంస్కృతులకు నిలయం జుక్కల్ నియోజకవర్గం. ఓవైపు మహారాష్ట్ర, మరోవైపు కర్ణాటక సరిహద్దులు ఉండే జుక్కల్ నియోజకవర్గంలో.. జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ, పిట్లం, నిజాంసాగర్ మండలాలున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యేలకు తెలుగుతో పాటు కన్నడ, మరాఠీ భాషలు రావలసిందే. ఎందుకంటే సరిహద్దు ప్రాంతాల్లో అక్కడి ప్రజలు ఆయా భాషలే మాట్లాడతారు.

జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. ఇక్కడ మూడు దశాబ్దాల పాటు మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం చుట్టూ రాజకీయాలు నడిచాయి. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గంగారాం.. వరుసగా మూడుసార్లు ఓటమి చవిచూశారు. అయినప్పటికీ నియోజకవర్గంతో తన అను బంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని ఆయన ఆరాటపడుతున్నారు. నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఆయనకు పోటీగా మరో ఇద్దరు నాయకులు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. వ్యాపారవేత్త అయిన లక్ష్మీకాంతరావ్ కొంత కాలంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీ శ్రేణులతో సంబంధాలు పెంచుకుంటున్నారు. అలాగే నిజామాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్ కూడా టికెట్ ఆశిస్తూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

బలం చాటుకునే ప్రయత్నం..

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో జనంలో తిరుగుతున్న ముగ్గురు నేతలు తమ బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయిస్తుందని చెబుతుండడంతో పార్టీని బలోపేతం చేయడం ద్వారా తమ బలాన్ని పెంచుకునేందుకు నేతలు పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగారాం సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉండడంతో ఏ గ్రామంలో ఎవరు ఏమిటి అనేది తెలిసిన వ్యక్తి. ఆయన తనదైన శైలిలో ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఆయనకు పార్టీ అగ్ర నేతలందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇక లక్ష్మీకాంతరావు కొత్తే అయినా ఏడాదిగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గడుగు గంగాధర్ చాలాకాలంగా నియోజకవర్గంలోని కొందరు నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ బలం పెంచుకునేందుకు యత్నిస్తున్నారు.

ఎవరికి వారే..

జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ముగ్గురు నేతలు ఎవరికి వారుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులు కూడా మూడు వర్గాలుగా విడిపోయాయి. ఏ కార్యక్రమమైనా వేరువేరుగా పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ మూడు వర్గాలుగా విడిపోవడం ఆ పార్టీకి కొంత నష్టం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ కార్యక్రమాలను ఒక్కచోట నిర్వహించకుండా ఎవరికి వారుగా వెళ్తుండడంతో పార్టీ శ్రేణుల్లో కొంత గందరగోళం నెలకొంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రూపుల పంచాయతీ ఎటు దారితీస్తుందోనని శ్రేణులు ఒకింత ఆందోళన చెందుతున్నాయి.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్, బీఆర్‌ఎస్ నేతలు

- ఎమ్మెల్యే సురేందర్ డిమాండ్
- ఎల్లారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డి: ఉచిత విద్యుత్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఎల్లారెడ్డిలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ధర్నా నిర్వహించి, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అంటే భయంతో ఏం మాట్లాడుతున్నారో కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు, నాయకులు తానాజీరావు, జలంధర్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

సదాశివనగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. దోపిడీలు, దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఉపయోగ పడుతున్నాయన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక కుటుంబానికి నష్టం జరిగితే.. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఆ కుటుంబానికి న్యాయం చేయడానికి వీలుంటుందన్నారు. ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో సదాశివనగర్ పంచాయతీ పాలకవర్గం, వీడీసీ ప్రత్యేక శ్రద్ధ వహించడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సుమారు రూ. 2.50 లక్షల విరాళం అందించిన రైస్ మిల్లర్స్, ఇటుక బట్టీల నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు, విరాళం అందించినవారిని సన్మానించారు. కార్యక్రమంలో సీఐ రామన్, ఎస్సై తోట రాజేశ్, ఎంపీటీసీ బీరయ్య, ఉప సర్పంచ్ రవి, ఏఎస్సైలు నర్సయ్య, గంగసాగర్, ప్రమీల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సమస్యలను పరిష్కరిస్తాం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- నెల రోజుల్లో పాసుబుక్కులిస్తాం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

నిజాంసాగర్: అటవీ, రెవెన్యూ భూముల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. రికార్డుల ప్రకారంగా ధ్రువీకరణ పత్రాలు కలిగి, కబ్జాలో ఉన్న రైతులకు నెల రోజుల్లో పట్టా పాసుబుక్కులు అందిస్తామన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పహణీలను పరిశీలించి భూముల వివరాలను తెలుసుకున్నారు. నిజాంసాగర్ మండలం వెల్గనూర్ గ్రామ శివారులోని 242, 243, 244, 245, 246 సర్వే నంబర్లలో 8 ఎకరాల రెవెన్యూ భూములను అటవీ అధికారులు కబ్జా చేసుకున్నారని మండల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భూములను రైతులకు అప్పగించాలని కోరారు. సింగితం, ముగ్దుంపూర్, తున్కిపల్లి, ఒడ్డేపల్లి, మల్లూర్, వెల్గనూర్ గ్రామాల్లో భూముల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నారాయణ, ఆర్‌ఐ భాను, నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, మనోహర్, రమేష్‌గౌడ్, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రేపటినుంచే బీసీలకు ఆర్థిక సాయం

- ఇది నిరంతర ప్రక్రియ
- వీసీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం శనివారంనుంచి ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి బీసీ కుల వృత్తులు, చేతి వృత్తులకు ఆర్థిక సహాయం పథకం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెలలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 300 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సహాయం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. శనివారం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో పథకాన్ని ప్రారంభించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సహాయం అందుకున్న లబ్ధిదారులు తమకు నచ్చిన చోట అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి కులవృత్తి చేసుకోవచ్చన్నారు. నెల రోజులలోపు అధికారులు సదరు లబ్ధిదారు యూనిట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. బీసీ కులవృత్తుల ఆర్థిక సహాయం కోసం వచ్చిన ఏ దరఖాస్తునూ తిరస్కరించడం లేదని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం తెలిపారు.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికి దశల వారీగా పథకం వర్తింపజేస్తామన్నారు. బీసీ లబ్ధిదారుల ఎంపికను శుక్రవారం పూర్తి చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లానుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే 'సంక్షేమం' కట్

కామారెడ్డి క్రైం: గంజాయి సాగు చేసే వ్యక్తులకు రైతుబంధు, బీమావంటి సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా నార్కొటిక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే ఎక్సైజ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ వాడటం వల్ల కలిగే అనర్థాలను కళాశాల విద్యార్థులకు వివరించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర రాజు, డీఆర్‌వో వాణి, ఇంటర్మీడియట్ నోడల్‌అధికారి షేక్‌సలాం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేపల విత్తనోత్పత్తిపై నిండా నిర్లక్ష్యం

- పత్తాలేని చేప పిల్లల ఉత్పత్తి
- డిప్యుటేషన్‌తో కార్యాలయానికి తాళం
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు



చేప పిల్లల పెంపకం లేక వృథాగా ఉన్న సిమెంట్ పాండ్స్



తాళంవేసి ఉన్న అచ్చంపేట చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన అచ్చంపేట చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రానికి ప్రస్తుతం అతీగతీ లేకుండా పోయింది. ఒకప్పుడు చేపపిల్లల ఉత్పత్తి, చేపల మార్కెటింగ్ ద్వారా అభివృద్ధి పథాన నిలిచింది. ప్రస్తుతం చేప పిల్లల ఉత్పత్తి చేసే నాథుడు లేక కేంద్రం మూతపడింది.

కోటి చేప పిల్లల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా..

జిల్లాలోనే ఏకైక చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం అచ్చంపేట గ్రామంలో ఉంది. మత్స్యశాఖ మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న చేప పిల్లల కేంద్రం ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోని 44 గ్రామాలకు చెందిన 1,180 మత్స్య కార్మిక కుటుంబాలు ఉన్నాయి. సదరు విత్తనోత్పత్తి కేంద్రంలో 36 నర్సరీలు, 8 కచ్చా పాండ్స్ ఉన్నాయి. ఆయా నర్సరీల్లో కోటి చేప పిల్లల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ వాటి నిర్వహణ లేక నెర్రలు బారి మూతపడ్డాయి.

అధికారులు, సిబ్బంది అంతా డిప్యుటేషన్..

ప్రత్యేక రాష్ట్రం సిద్ధించినప్పటికీ అచ్చంపేట చేపపిల్లల విత్తనోత్పత్తి కేంద్రం మహర్దశ మారలేదు. విత్తనోత్పత్తి కేంద్రం ఆధునికీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధుల మంజూరు చేయకపోవడంతో నర్సరీలకు మరమ్మతులు కరువయ్యాయి. అంతేకాకుండా సదరు మత్స్యశాఖ కేంద్రంలో పరిధిలో ఒక ఎఫ్‌డీవో, ఐదుగురు ఫీల్డ్‌మన్, 3 ఫీచర్‌మన్, 2 వాచ్‌మన్‌లు, ఒక స్వీపర్ పోస్టులు ఉన్నాయి. చేపపిల్లల ఉత్పత్తి లేకపోవడంతో ఇక్కడ ఉన్న సిబ్బంది అందరినీ డిప్యుటేషన్ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్నది ఒక్క స్వీపర్ మాత్రమే.. దీంతో దాదాపుగా కార్యాలయానికి తాళం వేసే ఉంటుంది. చేప పిల్లల విత్తనోత్పత్తి లేకపోవడంతో మత్స్యకారులు, మత్స్యకుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

చేప పిల్లలను ఉత్పత్తి చేయాలి



అచ్చంపేట సీడ్ ఫారంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను తిరిగి ప్రారంభించాలి. దశాబ్దాల కాలం నుంచి తల్లి చేప నుంచి పిల్లల చేపలను పిల్లల చేపల తయారు చేస్తున్నాం. రెండేళ్ల నుంచి చేప పిల్లల ఉత్పత్తి చేపట్టడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న అధికారులను శ్రీరాంసాగర్‌కు డిప్యూటేషన్ చేయడంతో అచ్చంపేట మత్స్యకేంద్రం మూతపడింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న మత్స్య కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాలి.

– రాములు, మత్స్యశాఖ సొసైటీ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికలకు అడుగులు

- రిటర్నింగ్ అధికారుల నియామకం

సాక్షి, కామారెడ్డి: కేంద్ర ఎన్నికల కమిషన్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను మొదలుపెట్టింది. అందులో భాగంగా నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. జుక్కల్ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డిలకు స్థానిక ఆర్డీవోలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని 28 మండలాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఆయా మండలాల తహసీల్దార్లే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

పోడు గొడవలో నలుగురు రైతుల అరెస్ట్



మాచారెడ్డి: మద్రితండాలో ఈనెల 2న పోడు భూముల విషయంలో అటవీ శాఖ అధికారులతో జరిగిన వాగ్వాదంలో రైతులపై అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అటవీ భూమిని దున్నడమే కాకుండా తమ విధులకు ఆటంకపరిచినట్టు నమోదైన కేసులో వారిని గురువారం రిమాండ్ చేసినట్టు ఫారెస్ట్ సెక్షన్ అధికారి పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్దాపూర్ తండాకు చెందిన లకావత్ హరిదాస్, లకావత్ శంకర్, బానోత్ రాజు, బానోత్ మల్‌రెడ్డిలను రిమాండ్ చేశామని పేర్కొన్నారు.

'రైతులకు న్యాయం చేయండి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

లింగంపేట: ధరణితో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన గురువారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి వల్ల లింగంపేట మండలంలోని 170 కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. లింగంపేటలో 983 సర్వే నంబర్‌లో 450 ఎకరాల భూమిని ధరణి నుంచి తొలగించడంతో 170 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ భూమికి సంబంధించి రైతులకు పట్టాలు న్నాయని, గతంలో రైతుబంధు కూడా వచ్చిందని పేర్కొన్నారు. గతంలో సదాశివనగర్ మండలం యాచారం, లింగంపల్లి గ్రామాల్లో రైతుల సమస్యలపై పోరాడడంతో వాటికి పరిష్కారం లభించిందన్నారు. ధరణితో ఇబ్బందిపడుతున్న రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే హైకోర్టుకు వెళ్తామన్నారు.

క్లుప్తంగా

అధిష్టానం అవకాశమిస్తే పోటీ చేస్తా..


నవీన్ కుమార్

పిట్లం(జుక్కల్) : అధిష్టానమిస్తే ఇస్తే జుక్కల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దెల నవీన్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోటీ చేశానన్నారు. అనంతరం 2018లో బీఆర్‌ఎస్‌లో చేరగా అప్పట్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తనకు సముచిత స్థానం కల్పిస్తామని మాటిచ్చారన్నారు. పార్టీ కార్యకర్తగా నిబద్ధతతో పనిచేశానన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో పక్కా సమాచారం మేరకు నల్లబెల్లం, పట్టికను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారావు తెలిపారు. గురువారం ముంబాయి నుంచి వచ్చే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ఎస్–6, ఎస్–7 బోగీలలో తనిఖీలు నిర్వహించగా 13 సంచుల నల్లబెల్లం, 6 సంచుల పట్టిక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటిని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ ఎస్సై మల్లేష్‌కు అందజేసినట్లు తెలిపారు.

పాఠశాలలో పాము కలకలం



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని ఫత్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నాగుపాము కలకలం సృష్టించింది. పాఠశాలలో విద్యార్థులు చదువుతున్న గదిలోకి వెళ్లింది. గమనించిన ఉపాధ్యాయురాలు వినీత వెంటనే విద్యార్థులను గదిలో నుంచి బయటకు పంపించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్తులను పిలిపించి పామును కొట్టి చంపేశారు. పాఠశాల వెనక పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, ఇతర విషపు పురుగులు గదుల్లోకి వస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి..

ఇందల్వాయి : తన భార్యతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడని ఓ వ్యక్తిపై ఆమె భర్త, కొడుకు కలిసి దాడి చేసిన ఘటన నల్లవెల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిర్మల్ అనే వ్యక్తి గ్రామంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై ఆమె భర్త, కొడుకు కలిసి గురువారం పొలం నుంచి వస్తున్న తిర్మల్‌పై దాడి చేశారు. తిర్మల్ ప్రస్తుతం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేరుకే పార్ట్‌టైం.. పని ఫుల్‌టైం

- అవస్థలు పడుతున్న పార్ట్‌టైం స్వీపర్లు
- నెలజీతం రూ. 4 వేలు మాత్రమే
- ఉమ్మడి జిల్లాలో 120 మంది


ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు

కామారెడ్డి రూరల్ : పాఠశాలల పరిశుభ్రత, ఉపాధ్యాయులకు అవసరమైన వివిధ రకాల పనుల నిర్వహణ..విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించే పార్ట్‌టైం స్వీపర్ల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో తమ సమస్యల పరిష్కారానికి వారు ఆందోళన బాట పట్టారు. పేరుకే పార్ట్‌టైం అయినప్పటికీ వారి పనులు మాత్రం ఫుల్‌టైం, ఉదయం నుంచి పాఠశాల ముగిసే వరకు డ్యూటీ చేయాల్సి వస్తుందని స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 120 మంది పార్ట్‌టైం స్వీపర్లుగా 1986లో విధుల్లో చేరారు. అప్పుడు ప్రభుత్వం కేవలం రూ.150 వేతనం మాత్రమే అందించేది. విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం స్వీపర్లలో సుమారు 60 మంది చనిపోయారు. మిగితా 20 మంది పదవీవిరమణ పొందారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ప్రైమరీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 120 మంది స్వీపర్లు పనిచేస్తున్నారు.

పార్ట్‌టైం స్వీపర్లు అన్న మాటే కానీ ప్రతి రోజు పాఠశాలలో ఫుల్‌టైం విధులు నిర్వహించాల్సి వస్తుందని, ఈ ఉద్యోగం వదులుకోలేక ఇతర పనులు చేసుకోలేకపోతున్నామని స్వీపర్లు వాపోతున్నారు. నెల జీతం రూ.4 వేలు వస్తుండడంతో నెలంతా పనిచేస్తే రోజు వేతనం రూ.133 మాత్రమే వస్తుందని, కనీసం ఉపాధిహామీ కూలీ వేతనం కూడా గిట్టుబాటు కానీ పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు.

డిమాండ్లివే..

ఉద్యోగంలో చేరిన వేతనం రూ. 150 నుంచి రూ. 1,225, రూ. 1,623, ప్రస్తుతం రూ. 4 వేలు ఇస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి రూ. 27 వేల వేతనం చెల్లించాలని, చనిపోయిన స్వీపర్స్ స్థానంలో వారి వారసులను నియమించాలి. విద్యార్హత ఉన్నవారికి అటెండర్‌లుగా నియమించాలని డిమాండ్ చేశారు. పీఎస్, యూపీఎస్, జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

జిల్లా కేంద్రమైన కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం వారికి మద్దతుగా ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజలింగం, ఎస్‌కె హుస్సేన్, ఉప్పు లక్ష్మణ్, గంగాధర్, సుధాకర్‌పాల్గొన్నారు.

భారంగా వెళ్లదీస్తున్నాం..



పార్ట్‌టైం స్వీపర్‌గా 1977లో ఉప్పర్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో విధుల్లో చేరాను. తొలిసారి జీతం రూ. 45 కాగా ఇప్పుడు రూ. 4 వేలు వస్తుంది. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం పార్ట్‌టైం స్వీపర్లను ఆదుకుని రూ. 27 వేల వేతనం అందించాలి.

– సిద్దిరాములు, యూపీఎస్ పాఠశాల, ఉప్పర్‌పల్లి,

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎన్నోఏళ్లుగా వేతనం పెరగడం లేదు. ప్రభుత్వం మా పరిస్థితిని పరిశీలించి ఫుల్ టైం స్వీపర్‌గా గుర్తించి పూర్తిస్థాయి వేతనం అందించాలని వేడుకుంటున్నా, ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

– సాయన్న, లింగంపల్లి హైస్కూల్ (ఖుర్దు), లింగంపేట

నెలనెలా చెల్లించాలి..



వచ్చే రూ. 4 వేల నెలనెలా ఇవ్వకుండా మూడు నాలుగు నెలలకోసారి ఇవ్వడంతో కుటుంబ పోషణ దారుణంగా తయారైంది. నా భర్త సిద్దిరాంలు 1992లో మరణిస్తే రూ. 350 వేతనంతో పాఠశాలలో చేరాను. ఇప్పుడు రూ. 4 వేలు ఇస్తుండ్రు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఏ పనిచేసుకోలేక ఇటు జీతం సరిపోక బతకంతా దయనీయంగా మారింది.

– సరోజ, గర్గుల్ హైస్కూల్, కామారెడ్డి

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన బస్సు

మాక్లూర్ : ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి నిజామాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన సంఘటన గురువారం మండలంలోని బోర్గాం (కె) చెరువు కట్ట వద్ద జరిగింది. డ్రైవర్ చాకచక్యంతో 60 మంది విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పాఠశాల యాజమాన్యం మరో బస్సును తెప్పించి విద్యార్థులను స్కూల్‌కు తరలించారు. మానిక్‌భండార్ చెక్క నుంచి బోర్గాం (కె) వరకు ఇటీవలే బీటీ రోడ్డు వేశారు. రోడ్డు వేసిన 10 రోజులకే కురిసిన వర్షాలకు చెరువుకట్టపై రోడ్డు కృంగిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డును సరి చేయాలని గ్రామస్తులు గతంలో కాంట్రాక్టర్‌ను కోరారు. 'సాక్షి'లో ఈ రోడ్డుపై కథనాలు ప్రచురితం కాగా పైపైనే పనులు చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. స్థానికులు కాంట్రాక్టర్, సంబంధిత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా: మహిళలకు గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

డిచ్‌పల్లి : మండలంలోని నడిపల్లి శివారులో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ నుంచి నలుగురు ప్రయాణీకులతో జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామానికి వెళ్తున్న ఆటో నడిపల్లి శివారులో ముందున్న కారును ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నిస్తూ డివైడర్‌ను ఢీకొని ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న కళావతికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో బాధితులను పైలట్ కిషన్, ఈఎంటీ సురేష్ జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ బోర్డును ఢీకొని ఒకరి మృతి


మృతుడు సాయిలు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ వద్ద గురువారం ఫ్లెక్సీ బోర్డును ఢీకొని ఓ సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి వివరాల ప్రకారం.. అంబం గ్రామం రుద్రూర్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త చాకలి సాయిలు(47) గురువారం అదే గ్రామానికి చెందిన కల్లూరు లక్ష్మయ్యతో తన బైక్‌పై నిజామాబాద్‌కు బయలుదేరాడు. గాంధీనగర్ వద్ద బైక్ అదుపుతప్పి ఫ్లెక్సీబోర్డును ఢీకొనగా వెనక కూర్చున్న సాయిలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయిలు మృతి చెందాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఎదురుగా కోటగిరి–బీర్కూర్ ప్రధాన రహదారిపై బైక్‌పై వెళ్తున్న కొడిచర్లకు చెందిన ఓ వ్యక్తిని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించినట్లు సమాచారం.

గంజాయి కేసులో బైండోవర్

ఖలీల్‌వాడి : నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారుగల్లీలో మీసేవ సెంటర్ వద్ద గంజాయి అమ్మడానికి వెళ్తున్న బర్కత్‌పురాలోని లైసగల్లీకి చెందిన షేక్ అఫ్రోజ్(28)ను అరెస్ట్ చేసి బైండోవర్ చేసినట్లు ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిషేధిత ఎండు గంజాయిని నిర్మల్‌కు చెందిన సల్మాన్ వద్ద కొనుగోలు చేసి అఫ్రోజ్ వాటిని ప్యాకెట్ల రూపంలో చేసి అనుమానం రాకుండా విత్తనాల సంచిలో తీసుకెళ్లి అమ్మేందుకు వెళ్తున్నాడన్నారు. పక్కా సమాచారం మేరకు అతడి వద్ద నుంచి రూ. 2000 విలువైన 125 గ్రాముల ఎండు గంజాయి అతడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయితే గతకొన్ని రోజుల క్రితం బోధన్ బస్టాండ్ వద్ద గంజాయి అమ్ముదామని వెళ్తున్న షేక్ అఫ్రోజ్‌ను అబ్కారీ పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో ఇతడిపై కేసు నమోదైందన్నారు. ప్రస్తుతం నిందితుడిని తహసీల్దార్ ప్రసాద్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు.

నిందితుడికి జైలు..

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో జనవరి నెలలో ఓ షాప్‌లో జరిగిన చోరీ కేసులో నిందితుడికి ఆర్నెల్ల జైలు శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి స్థానిక ఎస్సై రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. ఉప్లూర్‌లో జనవరిలో చిలుకూరి రమేశ్‌కు చెందిన దుకాణంలో నగదు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన అల్లెపు రాజేషను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఆర్మూర్ కోర్టులో ప్రవేశపెట్టి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. కేసు విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ వేముల దీప్తి గురువారం నిందితుడికి ఆర్నెల్ల సాధారణ జైలు శిక్షతో పాటు, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

టన్నెల్‌లో పడి వలస కార్మికుడి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- గోప్యంగా ఉంచిన కంపెనీ ప్రతినిధులు, పోలీసులు..!

మోపాల్ (నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్ప కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్దగల ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వలస కార్మికుడు అర్జున్ పుర్తి (23) పంప్‌హౌజ్ టన్నెల్‌లో పడి మృతిచెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కంపెనీ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ పుర్తి రెండు నెలల క్రితం లక్ష్మి ట్రాన్స్‌మిషన్ కంపెనీ పని నిమిత్తం సబ్‌స్టేషన్‌లో పని చేసేందుకు మంచిప్పకు వచ్చాడు. మంగళవారం విధులు ముగించుకున్న అర్జున్ పుర్తి సహా మరో ముగ్గురు 21వ ప్యాకేజీ పంప్‌హౌజ్ టన్నెల్ వైపు వెళ్లారు. అక్కడ అర్జున్ పుర్తి ప్రమాదవశాత్తు కాలుజారి సుమారు 70 ఫీట్ల లోతున్న టన్నెల్‌లో పడి మృతిచెందాడు. ఆరోజు మిగితా ముగ్గురు విషయాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. బుధవారం ఉదయం ప్రాజెక్ట్ కంపెనీ ప్రతినిధులకు అర్జున్ టన్నెల్‌లో పడిపోయాడని చెప్పగా వారు టన్నెల్‌లోకి వెళ్లి పరిశీలించారు. అర్జున్ మృతిచెంది ఉండటంతో ప్రాజెక్ట్ ప్రతినిధులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. లక్ష్మి ట్రాన్స్‌మిషన్ సైట్ ఇంజినీర్ రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి తరలించారు. కాగా వలస కార్మికుడి మృతి విషయాన్ని కంపెనీ ప్రతినిధులు, పోలీసులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

దుస్తులు ఉతికేందుకు వెళ్లి..


బోయిని ఐశ్వర్య మృతదేహం

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన బోయిని ఐశ్వర్య(17) అనే బాలిక గురువారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు బీర్కూర్ ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు. ఐశ్వర్య ఉదయం దుస్తులు ఉతికేందుకు ఊర చెరువుకు వెళ్లిందని, దుస్తులు ఉతికే క్రమంలో కాలుజారి చెరువులో పడగానే మూర్ఛ రావడంతో నీటిలో మునిగి మృతి చెందిందని అన్నారు. మృతురాలు బీర్కూర్ మండల కేంద్రంలో 9వ తరగతి చదువుతోందన్నారు. మృతురాలి తండ్రి బోయిని హన్మాండ్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలోని సీతాయిపల్లి చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన చెంచల హన్మాండ్లు (26) మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. సర్వాపూర్ గ్రామానికి చెందిన హన్మాండ్లు సీతాయిపల్లి గ్రామానికి చెంచల మొగులయ్య కూతురు మోహన గాంధీ ఇంటికి ఏడాదిన్నర క్రితం ఇల్లరికం వచ్చాడు. వారికి మూణ్నెళ్ల బాబు ఉన్నాడు. ఆదివారం పస్కజాతర విందు కోసం సర్వాపూర్ వెళ్లాడు. సోమవారం సీతాయిపల్లికి తిరిగి వచ్చాడు. మంగళవారం మాధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని సీతాయి చెరువులో హన్మాండ్లు మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హన్మాండ్లుకు మూర్ఛరోగం ఉందని, కాలకృత్యాల కోసం చెరువుకు వెళ్లి అందులో పడి మృతి చెంది ఉంటాడని మృతిడి మామ మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని రెండు ఆవులు..


మృతి చెందిన ఆవులు

ధర్పల్లి : మండలంలోని మద్దూల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న ఆవుల మందపైకి లారీ వేగంగా దూసుకెళ్లడంతో రెండు ఆవులు మృతి చెందాయి. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలం దూప్యానాయక్ తండాకు చెందిన రైతు బంతిలాల్ తమ ఆవుల మందను మేత కోసం ధర్పల్లి శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గురువారం మద్దుల్ చౌరస్తా వద్ద ఆవులమంద రోడ్డు దాటుతున్న సమయంలో ఇందల్వాయి నుండి ధర్పల్లికి అతివేగంగా వస్తున్న లారీ ఆవుల మందను ఢీకొంది.

ఈ ప్రమాదంలో రెండు ఆవులు మృతి చెందగా మరో రెండు ఆవులు పరిస్థితి విషమంగా ఉంది. రైతు బంతిలాల్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'24 గంటల విద్యుత్‌పై స్పష్టత ఇవ్వండి'

- ఆర్‌టీఐ కింద జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్ : రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య కరెంట్ లొల్లి నడుస్తుండగా కామారెడ్డి జిల్లాలో వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలని జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి గురువారం ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఏఏ గ్రామాల్లో ఇస్తున్నారో తెలపాలని, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే ఎన్ని రోజుల్లో మరమ్మతు చేసి ఇస్తున్నారు.. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వస్తే ఎంత సమయంలో పరిష్కరిస్తున్నారు.. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరీకి ఎంత వ్యయం అవుతుంది, ఎన్ని రోజుల్లో మంజూరు చేస్తున్నారని వీటికి అధికారికంగా జవాబు ఇవ్వాలని కోరారు. మోహన్ రెడ్డి మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌పై కాకిలెక్కలు చెబుతోందని, గ్రామాల్లో నిరంతరాయంగా కరెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్


కళాశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములై సహకారం అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గురువారం డిగ్రీ కళాశాల సందర్శించి ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య ఉండడంతో ఏఈతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కళాశాలలో కంప్యూటర్స్, ల్యాబ్, లైబ్రరీలో పుస్తకాలు, ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందిస్తానని కలెక్టర్ అన్నారు. కళాశాల స్థలాన్ని కొందరు ఆక్రమించారని ఫిర్యాదు చేయగా.. వెంటనే సర్వే చేసి హద్దు వేయాలని తహసీల్దార్ భరత్‌ను ఆదేశించారు. బిచ్కుంద కళాశాల న్యాక్‌లో ఏ–గ్రేడ్, స్వయం ప్రతిపత్తి(అటానమస్) సాధించిన కళాశాలగా రికార్డు సృష్టించినందుకు ప్రిన్సిపాల్, లెక్చరర్లను కలెక్టర్ అభినందించారు. కళాశాలలో ఉన్న హరితవనంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఎంపీడీవో ఆనంద్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి


అర్చకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల

నిజామాబాద్ సిటీ : వివిధ కులాలకు చెందిన వారి పిల్లలు తమ కుల వృత్తులను వదిలి ఇతర రంగాల వైపు వెళ్తున్న తరుణంలో అర్చకుల పిల్లలు అర్చక వృత్తిని వదిలి వెళ్లకుండా వేదం బతకాలి, వేదాన్ని బతికించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. అందులో భాగంగానే దూప దీపా నైవేద్యానికి వేతనం పెంచారన్నారు. గురువారం నగరంలోని గాజుల్‌పేట్ వీరభద్ర స్వామి ఆలయంలో దూపదీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఆత్మీయ సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలను సీఎం అభివృద్ధి చేస్తున్నారని, అర్చకుల తర్వాత వారి పిల్లలు అర్చకులుగా స్థిరపడేలా కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాకముందు దీప దూప నైవేద్యానికి రూ. 2,500 ఉండగా సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపు రూ. 6 వేలు చేశారని, అనంతరం ఈ వేతనం సరిపోవటంలేదని ఇటీవలే రూ. 10 వేలు చేశారన్నారు. నగరంలో మినీ ట్యాంక్‌బండ్‌పై గణేశ్ ఆలయం పునర్నిర్మాణం చేశామని, ముదిరాజ్ సంఘంకు రూ. 50 లక్షలు ఇచ్చామని, పెద్దమ్మ గుడి నిర్మాణం జరుగుతుందని, కోటగల్లీ మార్కేండేయ మందిరానికి రూ. 25 లక్షలు, హమల్‌వాడి సాయిబాబా గుడికి రూ. 50 లక్షలు, రాహుకేత్ గుడికి వెళ్లేందుకు రూ. కోటితో బీటీరోడ్డు నిర్మాణం, సారంగపూర్ హనుమాన్ మందిరం మార్గానికి రూ. 1.50 లక్షలు, నాందేవ్‌వాడ విఠలేశ్వర ఆలయంకు నాలుగు షెటర్లు మంజూరు చేశామన్నారు. గుడిలో రాజకీయాల గురించి మాట్లాడే పార్టీ తమది కాదన్నారు. ఆలయాల్లో నైవేద్యం పెట్టని అర్చకుల పేర్లు పథకంలో తొలగిస్తామని దేవాదాయ సహాయక కమిషనర్ సుప్రియ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మాట్లాడుతూ దూపదీప నైవేద్యం అర్చకులు ఐక్యంగా ఉండాలని, రాబోవు రోజుల్లో వేతనం రూ. 23వేలు సాధించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అర్చక సఘం నిజామాబాద్ అధ్యక్షుడు రాచప్పా, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజన్నస్వామి, తెలంగాణ వర్కింగ్ ప్రసిడెంట్ నాగదక్షిణ మూర్తి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు గోపీకృష్ణ, ఉమ్మడి జిల్లాల అర్చకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

- ఏసీపీ కిరణ్ కుమార్
- పలు బైక్‌లు, ఆటోలు, కార్లు స్వాధీనం


వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి : వాహనదారులు నిబంధనలు పాటించాలని ప్రజలతో సత్సంబంధాల కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని భారతిరాణి కాలనీ(డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిధి)లో పోలీసులు ఇంటింటికీ తిరుగుతూ కాలనీవాసులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. వాహనాలపై వెళ్లే వాళ్లు హెల్మెట్ ధరించాలని, వాటికి సంబంధించిన పత్రాలు వాహనాదారులు ఉంచుకోవాలని, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కవద్దన్నారు. తెలిపారు. అకౌంట్ల వివరాలు ఆన్‌లైన్ ద్వారా సమాచారమడిగితే ఎవ్వరికి ఇవ్వరాదన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. లక్కీడ్రా పేరుతో ఎవ్వరికీ డబ్బులు ఇవ్వరాదన్నారు. మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే డయల్ 100 లేదా 1930 కు సంప్రదించాలని, తెలియని వ్యక్తులకు ఇంటిని కిరాయికి ఇవ్వవద్దన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 72 బైక్‌లు, 21 ఆటోలు, 5 కార్లు స్వాధీనం చేసుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఐదుగురు సీఐలు, 14 ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు 100 మంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి : ఒకరిని హత్య చేసి, మరొకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ముద్దాయి పెద్దలపల్లె రామయ్య(45)కు జీవితఖైదుతోపాటు ఏడేళ్ళ కఠిన జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన పెద్దలపల్లి రామయ్య, కూతురు రామయ్య మరో 8 మంది కలిసి నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌కు వలసవచ్చి ఇక్కడే మేస్త్రీ, కూలి పని చేస్తూ బతుకుతున్నారు. 2021 ఆగస్టు 2న అందరూ ఒకే రూంలో అంతా పడుకున్నారు. మధ్యరాత్రి పెద్దలపల్లె రామయ్య లేచి చూడగా ఆయన ఫోన్ కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న కూతురు రామయ్యను నిద్రలేపి తన ఫోన్ ఎక్కడని ప్రశ్నించాడు. తనకు తెలియదని పొద్దున చూద్దామని కూతురు రామయ్య అనగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. పక్కనే ఉన్న ఓబులేశు తదితరులు వారికి సర్దిచెప్పి పడుకోబెట్టారు. కాని తన ఫోన్‌ను కూతురు రామయ్యే తీసుకున్నాడని మనసులో పెట్టుకున్న పెద్దలపల్లె రామయ్య 2021 ఆగస్టు తెల్లవారుజామున లేచి సుత్తెతో కూతురు రామయ్య ముఖంపై, తలపై తీవ్రంగా కొట్టాడు. దీంతో కూతురు రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డువచ్చిన ఓబులేషుపై కూడా దాడి చేశాడు. ఈ విషయమై ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సెషన్స్ కోర్టు నేర న్యాయ విచారణ అనంతరం పెద్దలపల్లె రామయ్యపై హత్య, హత్యాయత్నం నేరం రుజువైనందున శిక్ష విధించినట్లు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు.

రేకుల షెడ్లను ఢీకొన్న డీసీఎం


హన్మాజీపేట్‌లో కూలిన రేకుల షెడ్

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్‌లో బుధవారం రాత్రి రేకుల షెడ్లను డీసీఎం వ్యాను అతివేగంతో వచ్చి ఢీకొందని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. హన్మాజీపేట్ గ్రామానికి చెందిన దొడ్ల రవీందర్ అనే వ్యక్తి రేకుల షెడ్‌లో శ్రీ సాయి హార్డ్‌వేర్, ట్రేడర్స్ దుకాణం నడుపుకుంటున్నాడు. బడాపహాడ్ నుంచి బాన్సువాడ వైపు అతివేగంతో వచ్చిన టీఎస్ 12 యూడీ 6041 డీసీఎం హార్డ్‌వేర్ షాప్‌నే కాకుండా పక్కనే ఉన్న మంగలి పోచయ్య కటింగ్ షాప్, వడ్ల రవీందర్‌కు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను కూడా ఢీకొంది. మద్యం సేవించి డీసీఎంను నడిపిన డ్రైవర్ నెనావత్ చరణ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రూ.7 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు.